నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 27 మార్చి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

కుకుడలో ఆర్ఎస్పీకి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

పంట నష్టంపై నోరుమెదపరా..?

నియోజకవర్గ సమస్యలు పట్టించుకునే నాథుడే లేడు

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- బెజ్జూర్ మండలంలో పర్యటన
- కుకుడలో 30 మంది బీఆర్ఎస్‌లో చేరిక

బెజ్జూర్, మార్చి 26 : ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఈ అంశంపై సర్కారు, సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు అసెంబ్లీలో నోరు మెదపకపోవడం దారుణమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఫైర్ అయ్యారు. బుధవారం బెజ్జూర్ మండలం కుకుడ, మర్తిడి, పాపన్‌పేట, గబ్బాయి, తలాయి, సోమిని, మొగవెల్లి తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రేవంత్ సర్కారు, స్థానిక ఎమ్మెల్యే హరీశ్‌బాబు సిర్పూర్ నియోజకవర్గ సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి అబద్ధపు హామీలతో గద్దెనెక్కి ప్రజలను మోసం చేశారని, ఏ ఒక్క గ్యారంటీ అమలు చేసింది లేదని మండిపడ్డారు. 500ల గ్యాస్ రావడం లేదని, కల్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం ఉత్తమాటే అని చెప్పారు. రైతు భరోసా అందక.. రుణమాఫీ రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇందిరమ్మ ఇండ్ల ఊసే లేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ సర్కారులో రైతులు రంది లేకంట వ్యవసాయం చేసుకున్నారని, ఇప్పుడు వారిలో చిరునవ్వు మాయమైందని తెలిపారు. అందుకే ప్రజలంతా మళ్లీ బీఆర్ఎస్ సర్కారే రావాలని కోరుకుంటున్నారని, కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేస్తామని నమ్మకంగా హామీ ఇస్తున్నారన్నారు. ఆర్ఎస్పీ వాయిస్‌పై అసెంబ్లీలో కొంత స్పందన వచ్చిందని, పంట నష్ట పరిహారం ఇచ్చేందుకు సర్కారు సిద్ధమవుతున్నదన్నారు. కుకుడలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ఆత్రం హరీశ్ ఆధ్వర్యంలో 30 మంది యువకులు ఆర్ఎస్పీ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి ఆర్ఎస్పీ కుండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ కన్వీనర్ లెండుగురి శ్యాంరావు, యూత్ కన్వీనర్ కాసిపాక రాజు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మొహమ్మద్ ఖాజా మోహినుద్దీన్, మండల అధ్యక్షుడు బూస సారయ్య, యూత్ మండల అధ్యక్షుడు దుర్గం తిరుపతి, కొండయ్య, ఆబీద్ ఖాన్, షంషొద్దీన్ బాబు పాల్గొన్నారు.

ఆర్ఎస్పీని సన్మానిస్తున్న కుకుడ మహిళలు

నకిలీ పత్తి విత్తనాల ముఠా గుట్టురట్టు

3.15 క్వింటాళ్లు స్వాధీనం

మందమర్రి, మార్చి 26 : మందమర్రిలో నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు బుధవారం మందమర్రి పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ వివరాలు వెల్లడించారు. మూడు రోజుల క్రితం నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్నట్లు సమాచారమందడంతో పోలీసులు తనిఖీలు చేపట్టి ఐదుగురిని అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడైన నిర్మల్ జిల్లా భైంసా పట్టణానికి చెందిన అబ్దుల్ రజాక్‌ను పట్టుకొని విచారణ చేపట్టగా, పొన్నారం గ్రామానికి చెందిన బొలిశెట్టి జనార్దన్, పట్టణానికి చెందిన కాశిపాక తిరుపతికి నకిలీ విత్తనాలు విక్రయించినట్లు తెలిపాడు. దేవాపూర్, చింతగూడ గ్రామ సమీపంలోని సల్పలవాగులో నకిలీ విత్తనాలు దాచి.. వీలున్నప్పుడల్లా రైతులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. అనంతరం నిందితుల వద్ద రూ. 7,87,500 విలువైన 3.15 క్వింటాళ్ల విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. చాకచక్యంగా నిందితులను అరెస్ట్ చేసిన సీఐ శశీధర్ రెడ్డి, ఎస్ఐ ఆంజనేయులు, హెడ్ కానిస్టేబుల్ పున్నం చందు, నిమ్మల సంపత్, గుణంత రావు, కానిస్టేబుళ్లు మహేశ్, షఫీ, సురేందర్, సమ్మయ్య, రాకేశ్, రవి, తిరుపతి, రమేశ్‌లను ఆయన అభినందించారు.

మందమర్రి సర్కిల్ కార్యాలయంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రవికుమార్

ఆర్కే-5, న్యూటెక్ గనుల్లో ఆకస్మిక తనిఖీలు

శ్రీరాంపూర్, మార్చి 26 : శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే-5, ఆర్కే న్యూటెక్ గనుల్లో కార్పొరేట్ జీఎం సేఫ్టీ చింతల శ్రీనివాస్, రీజియన్ జీఎం రఘుకుమార్, జీఎం ఎం శ్రీనివాస్ బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆర్కే-5 గని పై కప్పు కూలి ఎస్‌డీఎల్ యంత్రం కూరుకుపోయిన ప్రమాదంపై విచారణ చేపట్టారు. ప్రమాదం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గనిలో ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని మేనేజర్ సుధీర్‌కుమార్ జాను కార్పొరేట్ జీఎం చింతల శ్రీనివాస్ ఆదేశించారు. ఏజెంట్ రాజేందర్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఆర్కే న్యూటెక్ గనిలోకి దిగి పని స్థలాలు పరిశీలించారు. అనంతరం ఉత్పత్తిపై అధికారులతో సమీక్షించారు. కార్పొరేట్ జీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ అధికారులు రక్షణ చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు. ఉద్యోగులందరూ రక్షణ పరికరాలు తప్పని సరిగా వినియోగించాలన్నారు. ఏరియా సేఫ్టీ ఆఫీసర్ శ్రీధర్, గని మేనేజర్ స్వామిరాజు, సేఫ్టీ ఆఫీసర్ కొట్టె రమేశ్ పాల్గొన్నారు.

ఆర్కే 5, ఆర్కే న్యూటెక్ గనులను సందర్శిస్తున్న చింతల శ్రీనివాస్

నిరుపయోగంగా ఉన్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు

వ్యవసాయ బావిలో నుంచి నీళ్లు తోడుకుంటున్న గిరిజనులు

బావి నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న గిరిజనులు

ఇంటింటా ఏర్పాటు చేసిన నల్లాలు

పాటగూడ పానీ పాట్లు

తాగునీటి కోసం తండ్లాడుతున్న కొలాం గ్రామం

- మిషన్ భగీరథ ట్యాంకు.. ఇంటింటికీ నల్లాలున్నా ఫలితం శూన్యం
- పైపులైన్‌కు మరమ్మతులు చేసే నాథుడు కరువు
- పనిచేయని చేతిపంపు.. కిలోమీటర్ దూరంలోనున్న వ్యవసాయ బావే దిక్కు
- మరికొన్ని రోజుల్లో ఆ బావి కూడా ఎండిపోయే పరిస్థితి
- సర్కారు పట్టించుకోవాలని గ్రామస్తుల వేడుకోలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ) : అధికారుల నిర్లక్ష్యం ఆ కొలాం గ్రామానికి శాపంగా మారింది. కేసీఆర్ సర్కారులో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగు నీరందగా, ప్రస్తుతం పైపులైన్‌కు మరమ్మతులు చేసే నాథుడు లేక ప్రజానీకం అవస్థలు పడాల్సి వస్తున్నది. గొంతు తడుపుకునేందుకు కిలోమీటర్ దూరంలోనున్న వ్యవసాయ బావి వద్దకు కాలినడకన వెళ్లి రావాల్సిన దుస్థితి నెలకొంది.

అందని మిషన్ భగీరథ నీరు

కెరమెరి మండల కేంద్రానికి సుమారు 15 కిలోమీటర్ల దూరంలోనున్న పాటగూడలో సుమారు 50 కుటుంబాలు ఉంటాయి. ఇక్కడ కేసీఆర్ సర్కారు మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నిర్మించి.. ఇంటింటికీ నల్లాలు బిగించి నీటిని సరఫరా చేసింది. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చాక నిర్వహణ లోపంతో పైపులైన్‌లు దెబ్బతిన్నాయి. కొన్ని రోజుల క్రితం అధికారులు మరమ్మతులు చేయించినప్పటికీ ఆ తర్వాత పైపులైన్ లీకేజీ కావడంతో తాగు నీటి సమస్య మొదలైంది. సుమారు నాలుగైదు నెలలుగా తాగు నీరు సరఫరాకాక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఒకేఒక్క చేతిపంపు ఉండగా, ప్రస్తుతం ఎండలు ముదరడంతో భూగర్భ జలాలు అడుగంటి నీరు రావడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో కిలోమీటర్ దూరంలోనున్న వ్యవసాయ బావి నుంచి తాగు నీరు తెచ్చుకుంటున్నారు. మరికొన్ని రోజుల్లో ఈ బావి కూడా ఎండిపోతుందని, ఆ పరిస్థితిని తలుచుకుంటేనే భయంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తమ తాగు నీటి గోస తీర్చాలని వారు వేడుకుంటున్నారు.

కాంగ్రెస్ తెచ్చిన కరువు

పాటగూడ కొలాం గ్రామం

ఒకేసారి చెల్లిస్తే 90 శాతం వడ్డీమాఫీ

మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శివాజీ

మంచిర్యాలటౌన్, మార్చి 26: బకాయి ఉన్న ఆస్తిపన్ను వడ్డీతో సహా ఒకేసారి చెల్లిస్తే వన్‌టైం సెటిల్‌మెంట్ కింద 90 శాతం మాఫీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తౌటం శివాజీ తెలిపారు. బుధవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో 45,372 భవనాలుండగా, వాటి నుంచి ఆస్తిపన్ను రూపేణా మొత్తం రూ. 26.28 కోట్లు రావాల్సి ఉంది. ఇప్పటి వరకు 49 శాతం ఆస్తిపన్ను వసూలు చేసినట్లు ఆయన తెలిపారు. ఇంకా రూ. 13 కోట్లకు పైగా వసూలు చేయడం లక్ష్యంగా ఉన్నదని పేర్కొన్నారు. మంచిర్యాల కార్పొరేషన్‌లో ఆస్తిపన్నుపై వడ్డీరూపేణా మొత్తం రూ. 3.24 కోట్లు ఉందని, ఇందులో నుంచి రూ. 2.92 కోట్లు వడ్డీమాఫీ అయ్యే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. ఈ నెల 31లోగా పన్నులు చెల్లించాలని కోరారు.

మాట్లాడుతున్న కమిషనర్ శివాజీ

దౌర్జన్యం చేశారనడం సరికాదు

ఆస్తిపన్ను వసూలు కోసం తమ సిబ్బంది ఇంటిపై దౌర్జన్యం చేశారని ఆరోపించడం సరికాదని, అందులో దళిత కుటుంబం అని పేర్కొనడాన్ని పూర్తిగా ఖండిస్తున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ శివాజీ పేర్కొన్నారు. ఈ నెల 22న కార్పొరేషన్ సిబ్బంది వందపీట్ల రోడ్డులోని ఒక ఇంటికి వెళ్లి ఆస్తిపన్ను ఐదేళ్లనుంచి పెండింగ్‌లో ఉన్నదని అడగ్గా వారు తమ సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించారన్నారు. కేవలం పన్ను వసూళ్ల కోసమే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, తమ సిబ్బంది పన్ను బకాయిదారుల వద్దకు మాత్రమే వెళ్లి పన్ను చెల్లించాలని అడుగుతున్నారని, కుల ప్రస్తావన ఇక్కడ అవసరం ఉండదని స్పష్టం చేశారు.

పుట్టెడు దు:ఖంలో 'పది' పరీక్షకు..

దహెగాం, మార్చి 26 : తండ్రి మృతి చెందగా.. ఓ విద్యార్థిని పుట్టెడు దు:ఖంలోనూ పదో తరగతి పరీక్ష రాసింది. ఈ ఘటన దహెగాం మండంల చౌక గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన మేకల రాజయ్య మంగళవారం రాత్రి తీవ్ర అనారోగ్యానికి గురికాగా, కుటుంబ సభ్యులు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ దవాఖానకు తరలించారు. వైద్యం అందించినప్పటికీ ఫలితం లేకపోవడంతో తిరిగి అదే రాత్రి ఇంటికి తీసుకొచ్చారు. అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న అతను ఇంటికి రాగానే మృతి చెందాడు. ఈయన పెద్ద కూతురు అనురాధ దహెగాం కస్తూర్బాలో ఉంటూ పదో తరగతి పరీక్షలు రాస్తున్నది. ఆమె బంధువులు పరిక్ష కేంద్రం వద్దకు వచ్చి అనురాధను తీసుకెళ్లారు. తండ్రి మృతదేహం వద్ద రోదిస్తూ సొమ్మసిల్లి పడిపోయింది. ఆపై రాజయ్య అంత్యక్రియలు నిర్వహించారు.

పరీక్ష రాసి కేంద్రం నుంచి బయటకు వస్తున్న అనురాధ

నీతి ఆయోగ్ పనులు త్వరగా చేపట్టాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మార్చి 26 : నీతి ఆయోగ్ పథకంలో భాగంగా తిర్యాణి బ్లాక్‌లో మంజూరైన పనులు త్వరగా చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పిరేషనల్ కార్యక్రమంలో భాగంగా బ్లాక్‌లలో అంబులెన్స్ సర్వీస్ కల్పించేందుకు అవసరమైన పరిపాలనా అనుమతులు రూపొందించాలన్నారు. 20 గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో శుద్ధమైన తాగునీరు అందించేందుకు ఆర్ఓ. ప్లాంట్‌లను ఏర్పాటు చేయాలని, జిల్లా కేంద్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని ఎంపిక చేసి అనుమతులు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి కోటయ్య నాయక్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, పశుసంవర్ధక శాఖ అధికారి సురేశ్, ఉపాధి కల్పనాధికారి రవికృష్ణ, వైద్య, ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, డీఈవో, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రే

స్వయం ఉపాధితో అండగా నిలవాలి

మందమర్రి, మార్చి 26 : వృత్తి శిక్షణ కోర్సులను పూర్తి చేసుకున్న మహిళలు స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకొని కుటుంబాలకు అండగా నిలవాలని సింగరేణి సేవా సమితి మందమర్రి ఏరియా అధ్యక్షురాలు జీ.స్వరూపారాణి దేవేందర్ సూచించారు. మందమర్రి సింగరేణి పాఠశాల ఆవరణలోని కేంద్రంలో నిర్వహిస్తున్న వృత్తి శిక్షణ తరగతులను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకే యాజమాన్యం టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నదన్నారు. కంప్యూటర్ కోర్సును పూర్తి చేసిన వారికి పరీక్ష నిర్వహించారు. శిక్షణ పొందిన వారు కుట్టినవి విక్రయించడానికి హైదరాబాద్‌లోని శిల్పారామంలో ఏటా నిర్వహించే ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్‌లో స్టాళ్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో లేడీస్ క్లబ్ సభ్యులు కవిత, మని తదితరులు పాల్గొన్నారు.

అల్లికలను పరిశీలిస్తున్న అధ్యక్షురాలు స్వరూపారాణి

నకలీ పత్తి విత్తనాలను అరికట్టాలి

నస్పూర్, మార్చి 26 : జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో వ్యవసాయ, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నకిలీ పత్తి విత్తనాల వినియోగం వల్ల కలిగే నష్టాలను రైతులకు వివరించాలన్నారు. మండలాలు, గ్రామాల్లో పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా దళారులు విడిగా పత్తి విత్తనాలు అమ్మితే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. నకిలీ పత్తి విత్తనాలతో పంటలు సాగు చేస్తే ప్రభుత్వం నుంచే వచ్చే పథకాలను నిలిపివేస్తామన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు బస్టాండ్, రైల్వేస్టేషన్, సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి కల్పన, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

జిల్లాలలో భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అక్రమ కట్టడాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేసి గ్రీవెన్స్ నంబర్ కేటాయించాలన్నారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి 21 రోజుల్లోగా సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం మండల, సబ్ డివిజన్ కమిటీల వారీగా వచ్చిన దరఖాస్తులపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, ఆర్డీవోలు, తహసీల్దార్, తదితరులు పాల్గొన్నారు.

కూతురితో అసభ్యంగా ప్రవర్తించిన తండ్రిపై పోక్సో కేసు

మందమర్రి, మార్చి 26 : కూతురి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన తండ్రిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. బుధవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణంలోని యాపల్ ఏరియాకు చెందిన ఆకుదారి సతీశ్.. మంగళవారం రాత్రి ఎనిమిదో తరగతి చదువుతున్న తన 15 ఏండ్ల కూతురిపై అసభ్యంగా ప్రవర్తించాడు. అడ్డుకోబోయిన అతరి భార్యను కొట్టి గాయపరిచాడు. ఆటో డ్రైవర్, పశువుల కాపరి అయిన సతీశ్-తన భార్యకు కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. పెద్ద కూతురు తనకు పుట్ట లేదనే అనుమానంతో ఎప్పుడూ ఆమెపై కోపంగా ఉండేవాడు. ఈ క్రమంలో బుధవారం ఇంట్లో పోచమ్మ పండుగ ఉందని సదరు బాలికను మంగళవారం మధ్యాహ్నం హాస్టల్ నుంచి తీసుకువచ్చాడు. అనంతరం బయటకు వెళ్లి మద్యం తాగి వచ్చి.. కూతురు బట్టలు చింపి.. అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ మేరకు బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు మంగళవారం రాత్రి మహిళా పోలీస్ అధికారి చేత వాంగ్మూలం నమోదు చేశారు. అనంతరం సతీశ్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

మందమర్రిలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ రాజశేఖర్